## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నేతలు..



ఫతేనగర్ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నేతలు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బ్రహ్మం, బరిగెల శ్రీను, లక్ష్మినారాయణ, సురేశ్, దీపులతో పాటు పలువురు యువత పాల్గొన్నారు.

– బాలానగర్, నవంబర్ 21

## మాధవరం కృష్ణారావుకే మా మద్దతు..



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకే తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఫతేనగర్ డివిజన్ వడ్డెర సంఘం సభ్యులు ప్రకటించారు. మంగళవారం ఫతేనగర్ డివిజన్ వడ్డెర సంఘం సభ్యులు కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి తమ మద్దతను తెలిపారు.

– బాలానగర్, నవంబర్ 21

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



జేఎన్‌టీయూహెచ్ ఆడిటోరియంలో పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 21 : కూకట్‌పల్లి నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.శ్యాంప్రకాశ్ అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూహెచ్ యూజీసీ ఆడిటోరియంలో నియోజకవర్గానికి చెందిన సెక్టోరియల్ ఆఫీసర్స్, పీవో, ఏపీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని.. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, వీవీ ప్యాట్లను తరలించడం.. తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకరావడం లాంటి పనులను పక్కాగా చేయాలన్నారు. ఈవిఎంలు మోరాయిస్తే వెంటేనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు, అధికారులున్నారు.

**దివ్యాంగులతో అవగాహన సమావేశం..**

పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని.. దివ్యాంగులు తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా స్వీప్ అసిస్టెంట్ డైరెక్టర్ యాదగిరి అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయంలో బాలావికాస ఎడ్యుకేషన్ సోసైటీ, కూకట్‌పల్లి న్యూశక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్ చైర్ అందుబాటులో ఉంటుందన్నారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటినుంచి ఓటు వేయడానికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటుహక్కు కీలకమని.. దివ్యాంగులంతా బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రావణ్, బాలావికాస ఫౌండర్ చైర్మన్ శ్యాంసుందర్, ఫ్యూడ్ చైర్మన్ గంగ రాజు, సెక్రటరీ నాగభూషణం, నియోజకవర్గం అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి, కార్యదర్శి చిరంజీవి, దివ్యాంగులు పాల్గొన్నారు.




కూకట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయంలో అవగాహన సమావేశంలో దివ్యాంగులు

# కారు గుర్తుకు ఓటేద్దాం.. అభివృద్ధిని కొనసాగిద్దాం

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 21 : కేపీహెచ్‌బీ కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన మాధవరం కృష్ణారావును ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించుకుందామని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 4,7వ ఫేజ్‌లలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటికి ప్రచారంతో పాటు భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, కార్యదర్శి రాజేశ్‌రాయ్, పాతూరి గోపీ, వెంకట్‌రెడ్డి, ప్రతాప్, హరిబాబు తదితరులు ఉన్నారు.



కూకట్‌పల్లి ఏవీబీ పురంలో ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నేతలు

**పేదలకు అండగా బీఆర్ఎస్..**

పేదలకు అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్‌లోని ఏవీబీ పురంలో కార్పొరేటర్ ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో వాసుదేవరావు, సంతోష్, ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలున్నారు.

**భారీ మెజార్టీతో గెలిపించాలి..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలన్ని పరిష్కరించి ఆదర్శవంతంగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావును మరోసారి భారీ మెజార్టీతో గెలించాలని ఓటర్లను కార్పొరేటర్ శిరీషాబాబూరావు కోరారు. మంగళవారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ముస్కీపేట, చిత్తరమ్మనగర్‌లలో కార్పొరేటర్ శిరీషా, మాజీ కార్పొరేటర్ బాబురావులు ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే నమ్మకం..**

బాలానగర్, నవంబర్ 21 : కారుగుర్తుకు ఓటెయ్యండి.. అభివృద్ధికి తోడ్పాటునందించండి అంటూ ఎమ్మెల్యే కృష్ణారావు కుమారుడు మాధవరం సందీప్‌రావు ఫతేనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోనిలోని గౌతంనగర్‌లోని పలు ప్రాంతాలలో కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌తో కలిసి ఇంటింటి తిరిగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె. రాములు, భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, కన్నయ్య, బాగయ్య, బస్వరాజ్, కరుణకర్, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పతి కోసం సతి ఎన్నికల ప్రచారం..**

కూకట్‌పల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి మాధవరం లక్ష్మిబాయి, అక్క రమాదేవి, కూతురు శ్రీలత, కోడలు అమూల్యలు బాలానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఆయన సతీమణి ఆవుల రాధికరెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, సాయినగర్, చెరబండరాజునగర్, కల్యాణినగర్, రాజుకాలనీ, మసీద్‌రోడ్‌లలో విస్తృతంగా ప్రచారం ప్రచారం చేశారు.



కేపీహెచ్‌బీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస‌రావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు



ముస్కీపేట, చిత్తరమ్మనగర్‌లో కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ బాబూరావు, బీఆర్ఎస్ నేతలు



ఎమ్మెల్యే కృష్ణారావు గెలుపు కోసం ఎన్నికల ప్రచారం చేసిన సతీమణి లక్ష్మీబాయి, కూతురు శ్రీలత, కోడలు అమూల్య, అక్క రమాదేవి

# వలసపక్షుల పల్లకిమోత ఇంకెన్నాళ్లు..?

- కూకట్‌పల్లిలో లోకల్ @ నాన్ లోకల్..
- స్థానికం.. స్థానికేతరంపై తీవ్రమైన చర్చ
- ఆలోచనలో ఓటర్లు.. స్థానిక నేతకే మొగ్గు
- జోరుగా బీఆర్ఎస్ ప్రచారం..
- డీలాపడ్డ జన సేన, కాంగ్రెస్ పార్టీలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 21 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో స్థానికం, స్థానికేతర అభ్యర్థుల అంశం కీలకంగా మారనుంది. అసెంబ్లీ ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కూకట్‌పల్లిలో వలసపక్షులు వచ్చి వాలుతుండడం.. ఏండ్లతరబడి ఆయా పార్టీలను అంటిపెట్టుకుని కష్టపడి పనిచేస్తున్న నేతలకు మొండిచేయి చూపుతుండడంతో ఆయా రాజీకీయ పార్టీలతో పాటు ఓటర్లలో తీవ్రమైన చర్చ సాగుతుంది. కూకట్‌పల్లిలో పుట్టిపెరిగి స్థానిక సమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్న నాయకుడు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలువగా.. బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థితో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సైతం కూకట్‌పల్లితో సంబంధం లేనివారే బరిలోకి దిగారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సామాన్య కార్యకర్తగా.. కౌన్సిలర్‌గా.. వైస్ చైర్మన్‌గా... రెండు సార్లు ఎమ్మెల్యేగా..20 ఎండ్లుగా ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవచేస్తూ.. కాలనీలు, బస్తీలలో నివసించే ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాడు. పార్టీలతో సంబంధం లేకుండా అందరివాడిగా అందుబాటులో ఉండే నేతగా గుర్తింపు అతనిది. కాగా.. ప్రతిపక్షాలు బరిలోకి దింపిన నేతలెవరికి కూకట్‌పల్లితో సంబంధాలు లేకపోవడంతో ఎన్నికల రణరంగంలో అపసోపాలు పడుతున్నారు. మరో పది రోజుల్లో ఎన్నికల పోలింగ్ ఉన్నప్పటికీ నేటికీ బూత్‌లెవల్‌లో కనీసం ఐదుగురు నమ్మకమైన వ్యక్తులు దొరకపోవడంతో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కారణం ఏంటని పరిశీలిస్తే.. గత కొన్నేళ్లుగా ఎన్నికలు రాగానే కూకట్‌పల్లిలో స్థానికేతరులు వచ్చి బరిలో నిలవడం.. ఓట్ల పండుగ పూర్తి కాగానే మళ్లీ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. స్థానికేతరులైన నాయకుల వెంట నడిచిన కార్యకర్తలంతా ఈ సారి ఆలోచన చేస్తున్నారు. ప్రతిసారి ఇదే తంతు కొనసాగుతుందని..వారిని నమ్మి మోసపోవద్దని.. స్థానికేతరుల పల్లకి మోయడం కంటే స్థానికుడైన నాయకుడి వెంట నడవాలని ప్రజలు నిర్ణయించుకున్నారు.

**జేపీ నుంచి నేటివరకు..**

2009లోఖైరతాబాద్ నియోజకవర్గంలో భాగమైన కూకట్‌పల్లి కొత్త నియోజకవర్గంగా ఏర్పడింది. నాడు జరిగిన అంసెబ్లీ ఎన్నికల్లో కూకట్‌పల్లికి చెందిన వడ్డెపల్లి నర్సింగరావు, మాధవరం సుదర్శన్‌రావులతో పాటు స్థానికేతరుడైన లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ (జేపీ) బరిలో దిగగా.. అపరమేధావిగా జేపీని నమ్మి ప్రజలు ఓట్లేసి ఆదరించారు. కానీ.. జేపీ ఎమ్మెల్యేగా ఏనాడు ప్రజల వద్దకు రాకపోగా.. సమస్యలు చెబుదామన్నా ప్రజలకు అందుబాటులో లేడు.. సూక్తులు చెబుతూ కాలం గడిపి మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి కనిపించకుండానే మాయమయ్యారు.

- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచిన మాధవరం కృష్ణారావు భారీ మెజార్టీతో విజయం సాధించగా ఓడిన నేతలెవరూ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు.
- 2019 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం నాటి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుపై కాంగ్రెస్, టీడీపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బంజారాహిల్స్‌లో నివాసముండే నందమూరి సుహాసినిని బరిలోకి దింపారు. ఎన్నికల్లో హడావిడి చేసి పరాజయం చెందిన ఆమె.. కనీసం ఎన్నికల తర్వాత తనకోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు కూడా చెప్పలేదు.
- 2023 అసెంబ్లీ ఎన్నికలు రాగానే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావును ఢీకొట్టేందుకు.. జూబ్లీహిల్స్‌కు చెందిన బండి రమేశ్‌ను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, శేరిలింగంపల్లికి చెందిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌ను జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దింపారు. ఎమ్మెల్యే టికెట్ కోసమే కాంగ్రెస్‌లో చేరిన బండి రమేశ్ శేరిలింగంపల్లి టికెట్ ఆశించగా.. హద్దులు తెలియని కూకట్‌పల్లిలో అవకాశమిచ్చారు. దీంతో 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన గొట్టిముక్కల వెంగళరావు, పద్మారావు లాంటి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పలువురు స్థానికేతరులకు టికెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ పార్టీని వీడారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ పార్టీలలో పనిచేసిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ ఎన్నికలకు కొద్ది రోజుల ముందే కూకట్‌పల్లికి వచ్చి బీజేపీ పార్టీ నేతగా ప్రచారం మొదలుపెట్టాడు. జనసేన, బీజేపీ పొత్తు ఖరారు కావడంతో రాత్రికి రాత్రే జనసేనలో చేరి బరిలోకి దూకాడు. ఇన్నాళ్లు టికెట్ కోసం ఆశించి భంగపడ్డ బీజేపీ నేతలంతా మూకుమ్మడిగా రాజీనామాలకు సిద్ధపడ్డారు. అధిష్టానం ఆదేశాలతో కలిసి పనిచేస్తున్నట్లు పైకి నటిస్తున్నా.. లోపలమాత్రం స్థానికేతరుడైన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌ను ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నారు.